క్లుప్తంగా

మండవల్లిలో ఫీవర్ సర్వే



మండవల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏఎన్ఎంలు ఫీవర్ సర్వే చేస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.అనీల శనివారం పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జ్వర పీడితులు అధికంగా ఉన్నారని, ఈ నేపథ్యంలో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఫీవర్ సర్వేలో ప్రజలకు పలు సూచనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. షేక్ హ్యాండ్ ఇవ్వకూడదని, పబ్లిక్‌లో ఉమ్మి వేయొద్దని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్‌ను సంప్రదించి యాంటిబయోటిక్స్ తీసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

నందివాడ తహసీల్దార్‌గా పవన్ నారాయణ



గుడివాడటౌన్(నందివాడ): నందివాడ తహసీల్దార్‌గా వెంపటి పవన్ నారాయణ నియమితులయ్యారు. విజయవాడ సివిల్ సప్లయిస్ డెప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన ఆయన పదోన్నతిపై నందివాడ తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించి శనివారం విధుల్లో చేరారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడటౌన్ : స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీ లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 72 మంది దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ హోమం చేసినట్లు ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీపై 'స్పందన'



మండవల్లి: స్పందన కార్యక్రమంలో ఇచ్చిన అర్జీపై మండవల్లి తహసీల్దార్ శనివారం స్పందించారు. పెట్రోలు బంకుల్లో సేవలు సక్రమంగా అందించడం లేదని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, సభ్యులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎ.జనార్దనరావుకు గతంలో అర్జీ అందజేశారు. ఫిర్యాదుదారుని ఇంటికి తహసీల్దార్ జనార్ధనరావు వెళ్లి పెట్రోల్ బంకుల్లో సమస్యలన్నీ పరిష్కరించారని, ఒకటి రెండు మినహా అన్నీ తీరినట్లు, ఎండార్స్‌మెంట్ ద్వారా తెలియజేశారు. దీంతో ఐక్య వేదిక సభ్యులు తహసీల్దార్‌ను అభినందించారు.

రెల్లి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



గుడివాడటౌన్ : వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా వెంకట రమణ(బాబ్జీ) చిరస్మరణీయుడని పలువురు వక్తలు అన్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అడపా బాబ్జీ స్మారక ఆంధ్ర, తెలంగాణ రెల్లి క్రికెట్ టోర్నమెంట్‌ను నాయకులు ప్రారంభించారు. తొలుత బాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శనివారం నుంచి 18వ తేదీ వరకు టోర్నమెంట్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు దుక్కిపాటి శశిభూషణ్, మండలి హనుమంతరావు, పాలేటి చంటి, పర్వతనేని ఆనంద్, పెయ్యల ఆదాం, మెరుగుమాల కాళి, గొర్ల శ్రీను, బాబ్జీ కుమార్తె అడపా సాయిశ్రావణి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ



కైకలూరు: వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని చెక్‌పోస్టుల్లో పనిచేసే సిబ్బంది సమయ పాలన పాటించాలని కైకలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత చెప్పారు. పలు చెక్‌పోస్టులలో రికార్డులను ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు.

నకిలీలకు అడ్డుకట్ట

సమగ్ర వ్యవసాయ ప్రయోగశాలతో లబ్ధి పొందుతున్న పామర్రు రైతులు

పామర్రు: వ్యవసాయరంగంలో నూతన శకం ఆవిష్కరించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చకచకా అడుగులు వేసింది. రైతు సమస్యలు పరిష్కరిస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. దీనిలో భాగం రైతులకు నాణ్యమైన విత్తనం, పురుగు మందులు, ఎరువులు అందించడం.. భూసార పరీక్షలు చేయడానికి మండల కేంద్రమైన పామర్రులో ఏర్పాటుచేసిన వైఎస్సార్ సమగ్ర వ్యవసాయ పరీక్ష ప్రయోగశాల ఇప్పుడు రైతులకు వరంగా మారింది. పామర్రులో జాతీయ వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ నిధులు రూ.55 లక్షలతో స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ ప్రయోగశాలను 2021 జూలైలో ప్రారంభించారు.

105 గ్రామాల రైతులకు ఉపయోగం

నియోజకవర్గంలోని 105 గ్రామాలోని రైతులు సాగు చేసే పంటల విత్తనాల నాణ్యతను పరీక్షించడమే కాకుండా రీజనల్ కార్యాలయం నుంచి వచ్చే విత్తనాలను కూడా పరీక్షిస్తున్నారు. నియోజకవర్గంలోని రైతులు గతంలో ఈ పరీక్షలు చేయించుకోవాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం చెంతనే ఉండటంతో రైతులు చింతలు తగ్గాయి. ఏది నకిలీదో.. కాదో త్వరగా తెలుసుకునే అవకాశం పామర్రు రైతులకు కలుగుతోంది.

నాలుగు రకాలుగా

ఈ ప్రయోగశాలలో వరి, మినుము, పెసర, పిల్లి పెసర, జనుము, మొక్కజొన్న, పత్తి, మిరప, రాగులు, సజ్జలు తదితరాలతో పాటు కూరగాయల పంటల విత్తనాల నాణ్యతను పరీక్షిస్తారు. ఈ విత్తనాలను నాలుగు రకాలుగా విభజిస్తారు. ఏసీటీ, ఆర్‌బీకే, ఫార్మర్, ట్రేడ్ నమూనాలుగా విభజించి పరీక్షిస్తారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల నుంచి రీజినల్ కార్యాలయాలకు చేరిన నమూనాలను ప్రత్యేకంగా కోడింగ్ ఇచ్చి వచ్చిన నమూనాలను 'ఏసీటీ'గా పరీక్షిస్తారు. పరీక్షలతో నకిలీ విత్తనాల బాధ తప్పుతోంది.



పామర్రులోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



విత్తనాల నాణ్యతను ప్రయోగశాలలో పరిశీలిస్తున్న అధికారులు

ఫర్టిలైజర్స్, సీడ్‌లకు సంబంధించి ఇప్పటి వరకు వచ్చిన శాంపిల్స్ వివరాలు

ఫర్టిలైజర్స్ ...

ఏడాది	ఏసీటీ	ఆర్‌బీకే	ఫార్మర్	ట్రేడ్ శాంపిల్స్
2021-22	23	0	2	0
2022-23	75	0	0	0
మొత్తం	98	0	2	0

సీడ్స్....

ఏడాది	ఏసీటీ	ఆర్‌బీకే	ఫార్మర్	ట్రేడ్ శాంపిల్స్
2021-22లో	46	0	2	0
2022-23లో	127	11	0	0
మొత్తం	173	11	2	0

ఆనందంగా ఉంది



పామర్రులో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. గతంలో విత్తనాలను పరీక్షించాలంటే విజయవాడలోని భవానీపురం వెళ్లాల్సి వచ్చేంది. ప్రస్తుతం దగ్గరలోనే ల్యాబ్ ఉండటంతో సమయం చాలా ఆదా అవుతోంది. రైతులకు ఉపయుక్తంగా ఉంటుంది.

–తమ్మా త్రికూట వెంకటాద్రిరెడ్డి, రైతు, పామర్రు

రైతులు వినియోగించుకోవాలి



అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను రైతులు అందరూ సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలి. అందుబాటులో ఉన్న పరీక్ష కేంద్రంలో సాగు చేస్తున్న పంట విత్తనాలను ఉచితంగా పరీక్షించుకుని నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవచ్చు. దీంతో మంచి దిగుబడులు సాధించవచ్చు.

–శ్రీదేవి, టెక్నికల్ ఏవో

అధునాతన పరికరాలతో ప్రయోగాలు



ఆధునాతనమైన పరికరాలతో కచ్చితమైన ఫలితాలు పొందడానికి ప్రయోగశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి రైతు దీన్ని వినియోగించుకుని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణ్యతను పరీక్షించుకోవచ్చు. దీంతో మెరుగైన దిగుబడులు వస్తాయి.

–స్వర్ణలత, ఏడీఏ పామర్రు

'గడప గడప'లో మనమే నంబర్‌వన్

- ఎమ్మెల్యే డీఎన్నార్
- కైకలూరు మండలంలో ముగిసిన కార్యక్రమం

కైకలూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వంలో.. రాష్ట్రంలో మనమే నంబర్‌వన్‌గా నిలిచామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. ఆలపాడులో కార్యక్రమం ద్వారా కైకలూరు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం ముగిసిన సందర్భంగా విజయోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. మండలంలో 22 సచివాలయాలకు 55 రోజులు 'గడప గడప'కూ వెళ్లారు. చివరి రోజు ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన జరిగిన విజయోత్సవ సభలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ, రాష్ట్ర వడ్డీలు వెల్ఫేర్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ చైర్‌పర్సన్ సైదు గాయత్రీ సంతోషి పాల్గొన్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్నానన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ కేటాయించి తనను అక్కున చేర్చుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర వడ్డీలు వెల్ఫేర్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ చైర్‌పర్సన్ సైదు గాయత్రీ సంతోషి మాట్లాడుతూ కొల్లేరు గ్రామాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో పని చేస్తున్నారన్నారు. సర్పంచ్ దంపతులు కొప్పుల కృష్ణకుమారి, ఏడుకొండలను ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ పార్టీ కండువా కప్పి చేర్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ, హౌసింగ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి శ్రీదేవి, ఘంటా సంధ్య, ఎంపీపీలు చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు కుర్రేళ్ల బేబీ, ముంగర విజయలక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, ఏలూరు జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బలే నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు నల్లగచ్చు ధనలక్ష్మి, కైకలూరు సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో కేక్ తినిపించుకుంటున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ

సమస్యల పరిష్కార వేదిక

గ్రామాల్లో సమస్యల పరిష్కార వేదికగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిలుస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చివరి రోజు ఆలపాడు గ్రామంలో శనివారం జరిగింది. మూడున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కుర్రేళ్ల బేబి, భట్రాజు శివాజీ, సర్పంచ్ కృష్ణకుమారి, ఉప సర్పంచ్ సలాది జ్యోతి, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొండరాజు, రవికుమార్, గోకర్ణయాదవ్, గోపాలకృష్ణ, ఏసేబురాజు, గాంధి, సురేష్‌బాబు, బలరామరాజు, మణి, లక్ష్మి, జయమంగళ కాసులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం పక్షపాతి నాని



గుడివాడటౌన్: తమ నాయకుడు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ముస్లింలకు అన్ని వేళలా అండగా ఉంటారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ బాజీ అన్నారు. శనివారం స్థానిక సత్యనారాయణపురంలో వలికి ఎమ్మెల్యే కొడాలి నాని ఇచ్చిన రూ. 20 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్, రజక్ బాషా, అబ్దుల్ తాజుద్దీన్, దిలీప్‌బేగ్ పాల్గొన్నారు.

ముగిసిన లూర్ధుమాత మహోత్సవాలు

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం వెన్ననపూడి గ్రామంలో జరుగుతున్న లూర్ధుమాత మహోత్సవాలు శనివారం ముగిశాయి. విజయవాడ మేత్రాసనం పీఠాధిపతులు రైట్ రెవరెండ్ తెలగతోటి జోసఫ్ రాజారావు తొలి ప్రార్థనలతో ముగింపు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం లూర్ధుమాత స్వరూపాన్ని ఊరేగించారు. బిషప్ జోసఫ్ రాజారావు మాట్లాడుతూ లూర్ధుమాత ఆశీస్సులతో ప్రజలు ఆనందంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో విచారణ గురువు రెవరెండ్ పాదర్ కూచిపూడి ప్రశాంత్, నిర్వాహకులు పాల్గొన్నారు. అనంతరం లాజరు–ధనవంతుడు బైబిల్ నాటిక ప్రదర్శించారు.

మూడు వేల మందికి అన్నసమారాధన

కైకలూరు: వేమవరప్పాడులో గంగానమ్మ ఆలయ పునఃప్రతిష్ట శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.18 గంటల ముహూర్తానికి విగ్రహ ప్రతిష్ట చేశారు. సర్పంచ్ నున్న రాంబాబు, తలారి శ్రీహరి, ద్వారంపూడి సుబ్బిరెడ్డి, బోయిన సురేష్, నున్న శ్రీనివాసరావు దంపతులు ఉభయదాతలుగా పూజలు జరిపారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ, సయ్యపురాజు గుర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు చేబోయిన వీర్రాజు తదితరులు పాల్గొన్ని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో జాజుల రాజు, బుర్ల శ్రీను, నున్న కాసులు, గొల్లబాబు, శ్రీనివాసరావు, తలారి మంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఏసు మార్గంలో పయనించాలి



నాగాపురం(పెదపారుపూడి): ఏసుక్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని వైఎస్సార్ సీపీ పార్టీ జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. మండలంలోని నాగాపురంలోని సిఎస్ఐ చర్చి 18వ వార్షికోత్సవ ఆరాధన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు నాగదేశి సుబ్రహ్మణ్యం, గోళ్ల సోమేశ్వరరావు, ప్రత్తిపాటి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కానుకొల్లులో పంటకాలువ తవ్వకం పనులు

మండవల్లి: మండలంలోని కానుకొల్లులో పంట కాలువ తవ్వకం పనులను ఉపాధి హామీ కూలీలు శనివారం చేశారు. 56 మంది ఉపాధి కూలీలు రూ.60 వేల ఉపాధి హామీ నిధులతో చేసినట్లు ఎంటీఏ నవీన్ పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా మెడికల్ అండ్ డయాబెటిక్ క్యాంప్

పామర్రు: స్థానిక చల్లపల్లి రోడ్డులోని లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత మెగా మెడికల్ అండ్ డయాబెటిక్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు.

క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం



తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఉయ్యూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్‌టీ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని యాకమూరులో క్యాన్సర్ బాధితుడు చిట్టిబాబుకు శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దాతలు తుమ్మల గోపీకృష్ణ, సుశీల, చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం రూ. 20 వేల నగదును అందజేశారు. రోటరీ ప్రతినిధులు సయ్యద్ అనీస్, పులి శ్రీనివాసరావు, మర్రెడ్డి ప్రసాద్‌రెడ్డి, గద్దం సాయికల్యాణ్ పాల్గొన్నారు.

ప్రతి పౌర్ణమికి అరుణాచలంకు ఆర్టీసీ సర్వీసు

గుడివాడటౌన్: గుడివాడ పరిసర ప్రాంత భక్తుల సౌకర్యార్థం డిపో నుంచి ప్రతి పౌర్ణమికి అరుణాచలం గిరి ప్రదక్షిణ చేసుకునేందుకు బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ రాజేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 4 నుంచి బస్సు సర్వీసు మొదలవుతుందన్నారు. ఆ రోజు రాత్రి 8 గంటలకు గుడివాడలో ప్రారంభమై 5వ తేదీ ఉదయం 5 గంటలకు బస్సు శ్రీకాళహస్తి చేరుతుందని తెలిపారు. మధ్యలో కాణిపాకం విఘ్నేశ్వరస్వామిని సాయంత్రం సిరిపురంలో గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకుని అదేరోజు రాత్రి బస్సు బయలుదేరి 6వ తేదీ పౌర్ణమికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 6వ తేదీ సాయంత్రం బస్సు తిరిగి ప్రయాణమై 7వ తేదీ ఉదయం 7 గంటలకు గుడివాడ చేరుకుంటుందన్నారు. ఈ యాత్రకు సూపర్ లగ్జరీ బస్సులో టికెట్ ధరను రూ. 3 వేలుగా ధర నిర్ణయించారన్నారు.

మహిళల అభివృద్ధికి కృషి

పామర్రు: మహిళలకు అన్ని రంగాల్లో 50శాతం రిజర్వేషన్లను కల్పించి మహిళా అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ ఇన్‌చార్జి కొత్తపల్లి రజని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి మహిళా నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలందరికీ అన్నలా, తమ్ముడిలా ఉంటూ వారికి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అనంతరం మహిళా ప్రతినిధులు రజనికి శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ రమాదేవి, ఎంపీటీసీ రత్నకుమారి, వీరాంజనేయస్వామి దేవస్థానం డైరెక్టర్ కుందేటి రాణి, 3వార్డు మెంబరు జువ్వనపూడి దివ్య పాల్గొన్నారు.

ముగిసిన హనుమాన్ చాలీసా పారాయణం

జుఝవరం(పామర్రు): గ్రామంలోని శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోని వీరాంజనేయస్వామికి 41 రోజులుగా హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్నారు. చివరి రోజు శనివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పూజా కార్యక్రమాలను రొంపిచర్ల సాయి వెంకట గణేష్ కృష్ణమాచార్యులు, ధన వెంకట సత్యనారాయాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామస్తులు జన్ను శోభన్‌బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

పసుమర్రు(పామర్రు): రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. పామర్రు మండలం పసుమర్రు సచివాలయ పరిధిలోని పెరిశేపల్లి, మల్లవరం తదితర గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. మూడున్నరేళ్లలో అందిన పథకాల లబ్ధిపై బుక్‌లెట్లను లబ్ధిదారులకు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు అందజేస్తారని తెలిపారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ శ్రీనివాసరావు, నాయకులు పెయ్యలరాజు, ఎస్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

తాడంకి హైస్కూల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పామర్రు(పమిడిముక్కల): తమ పాఠశాల పదో తరగతి విద్యార్థులు ప్రతిభా పురస్కారాలు అందుకుని నగదు ప్రోత్సాహకాలు పొందారని తాడంకి హైస్కూల్ హెచ్ఎం శారదాకాంత తెలిపారు. ఆమె శనివారం పాఠశాలలో మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో కోరమాండల్ వారు నిర్వహించిన బాలికల ప్రతిభా పురస్కారాలను హైస్కూల్ విద్యార్థులు సాధించారని అన్నారు. పదో తరగతి చదువుతున్న కంభపు రామ నాగదివిజ కు ప్రథమ బహుమతిగా రూ.5 వేల నగదు, ప్రతిభా పురస్కారాన్ని అందజేశారన్నారు. ద్వితీయ బహుమతిగా సత్య ప్రసన్నకు రూ.3,500 నగదు, ప్రశంసా పత్రాలు ఇచ్చారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అందజేశారని తెలిపారు. పురస్కారాలు అందుకున్న బాలికలను జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంభపు రాంబాబు, పీడీ ఏపీ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభా పురస్కారాన్ని అందుకుంటున్న కంభపు రామ నాగ దివిజ

రామాలయానిదే కల్యాణ మండపం

ఆలయ చైర్మన్ ఆళ్ల వీరప్రతాప్‌రెడ్డి

తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెంలోని కల్యాణ మండపం పక్కనే ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానిదేనని జిల్లా దేవదాయశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఆలయ చైర్మన్ ఆళ్ల వీరప్రతాప్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్ఎస్ నెంబరు 309-1ఎఫ్‌లోని 16 సెంట్లలో ఆలయం తరఫున 1990లో కల్యాణ మండపం నిర్మించారని తెలిపారు. కల్యాణ మండపాన్ని గ్రామకంఠంలో నిర్మించారంటూ 2016లో గ్రామపంచాయతీ దురాక్రమణ చేసిందని చెప్పారు. దీనిపై ఆరున్నరేళ్లుగా ఆలయ కమిటీ దశల వారీగా పోరాటం చేసి సంబంధిత స్థలం ఆలయానిదేనని నిరూపించిందన్నారు. కల్యాణ మండపాన్ని వెంటనే ఖాళీ చేసి రామచంద్రస్వామి ఆలయ చైర్మన్‌కు అప్పగించాలని జిల్లా దేవదాయ శాఖాధికారి జి. హరిగోపీనాథ్‌బాబు ఈ నెల 9న గ్రామపంచాయతీని ఆదేశించినట్లు వీరప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలయం ధూప, దీప నైవేద్యం ఖర్చుల కింద నెలకు రూ. 5 వేలను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించరు. తమకు మద్దతుగా నిలిచి సహాయ సహకారాలు అందజేసిన బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ధ్యాన కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభం

తోట్లవల్లూరు: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం, మానసికోల్లాసం లభిస్తుందని పిరమిడ్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లూరు శివనాగకృష్ణ తెలియజేశారు. బొడ్డపాడులో జాజుల పెద నాగేశ్వరరావు నివాసం వద్ద పిరమిడ్ ధ్యానకేంద్రం నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మూడే శివ శంకరరావు, ఉషశ్రీ, శైలజ, ఎన్. శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.